
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025





పట్టువస్త్రాలు తెస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న

కోటబొమ్మాళి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది జాతర ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ మేనేజర్ వాకచర్ల రాధాకృష్ణ, వేదపురోహితులు నుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు పూర్ణకుంభం, వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. అమ్మవారిని మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. చిన్నారులు, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్‌అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ చిన్నగోవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో కొత్తమ్మతల్లి

కొండెక్కిన కోడి ధర

● కిలో మాంసం రూ.285 ● దసరాకు మరింత పెరిగే అవకాశం



ఇచ్ఛాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా వేళ కోండి మాంసం ధరలు కొండెక్కాయి. ప్రస్తుతం డ్రెస్డ్ చికెన్ కిలో రూ.285గా ఉంది. దసరా నాటికి ఇది మరింత పెరిగి, రూ.350 వరకూ చేరుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే కిలోపై రూ.100 పెరగడం మాంసప్రియులను ఆందోళన కలిగిస్తోంది. దీంతో పండుగ పూట ముక్క కోసం అధికంగా ఖర్చు చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. దసరా సమీపిస్తుండడంతో సాధారణ రోజుల కంటే 10 శాతం వరకూ కోడి మాంసం అమ్మకాలు పెరిగాయి. ఆ ప్రభావం ధరలపై పడింది. జిల్లాలో వారానికి మూడు లక్షల కిలోల కోడి మాంసం విక్రయాలు జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రముఖ కంపెనీలకు చెందిన హేచరీల నుంచి 1.60 లక్షల కిలోల మాత్రమే సరఫరా అవుతోంది. రెండు వారాల కిందట వరకు లైవ్ కిలో ధర రూ.120 వరకూ ఉండగా ప్రస్తుతం రూ.165కు చేరుకుంది. ఆది, మంగళవారాల్లో డిమాండ్‌కు తగ్గట్టు కోళ్లు అందడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గుతున్న ఫారాలు..

జిల్లాలో కోళ్లఫారాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో పెద్ద ఎత్తున కోళ్లు చనిపోయాయి. తాజాగా వైరస్ సోకుతుండడంతో మృత్యువాతపడుతున్నాయి. వాస్తవానికి కోళ్లఫారంలో రెండు కిలోల వరకూ కోడిని పెంచాలంటే ఆహారం, ఇతరత్రా అవసరాలకు రూ.200 వరకు ఖర్చవుతుంది. 10వేల కోళ్లు పెంచే ఫారంలో అనారోగ్యంతో 2,500 వరకు చనిపోతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ నష్టాన్ని భర్తీ చేసేందుకు లైవ్ కిలోను రూ.125 వరకు అమ్ముతున్నారు. రవాణా, ఇతర ఖర్చులను కలుపుకుంటూ వ్యాపారులు మార్కెట్‌లో రూ.165కు విక్రయిస్తున్నారు.



● ఈమె పేరు **మహదాసు రమణమ్మ.** రణస్థలం గ్రామానికి చెందిన ఈమెకు వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో అధికారులు ఇంటి పట్టా ఇచ్చారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఆమె పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేశారు. పట్టా చేతిలో పెట్టారు. కానీ, స్థలం మాత్రం చూపించలేదు. అదేంటంటే కోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.



రణస్థలంలోని వివాదాస్పద జగనన్న లేఅవుట్ ఇదే

పట్టాలు సరే స్థలాలేవీ?



● రణస్థలం గ్రామానికి చెందిన ఈమె పేరు **మహంతి గౌరి.** జగనన్న కాలనీ లేఅవుట్‌లో సెంటున్నర స్థలం మంజూరు కావడంతో ఆమె ఎంతగానో సంతోషించారు. ఆమె పేరుతో అధికారులు రిజిస్ట్రేషన్ చేయించి చేతిలో పట్టా పెట్టారు. తీరా లేఅవుట్ వద్దకు వెళ్లేసరికి కోర్టులో ఉందని చెప్పడంతో ఆమె తీవ్ర నిరాశ చెందారు.

- జగనన్న లేఅవుట్లుగా వివాదాస్పద భూములు
- పట్టాలు అందించిన తరువాత కోర్టు కేసులు
- గత వైసీపీ పాలకుల నిర్వాకం
- ఆందోళనలో 196 మంది బాధితులు

రణస్థలం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ ఇద్దరే కాదు. దాదాపు 196 మంది లబ్ధిదారులదీ ఇదే పరిస్థితి. నవరత్నాల్లో భాగంగా జగన్ సర్కారు పేదలకు సొంతంటి కల నెరవేర్చేందుకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. రణస్థలం మండలానికి సంబంధించి రణస్థలంతో పాటు జేఆర్‌పురంలో లేఅవుట్లను గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రణస్థలానికి సంబంధించి రెండు విడతల్లో 134 మందికి ఇళ్ల పట్టాలు నాటి అధికారులు, వైసీపీ పాలకులు అందించారు. ఇళ్లు కూడా మంజూరు చేసినట్టు అప్పట్లో ప్రకటించి వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా చేయించి పట్టాలు చేతిలో పెట్టారు. తమకు ఇళ్ల పట్టాలు వచ్చాయని అంతా సంబరపడ్డారు. కానీ, లేఅవుట్ల వద్దకు వెళితే స్థలం చూపించలేదు. అదేంటని ప్రశ్నిస్తే కోర్టులో పెండింగ్ ఉందని.. వచ్చిన వెంటనే ఇంటి స్థలం అప్పగిస్తామని చెప్పుకొచ్చారు. జేఆర్‌పురంలో కూడా అదే పరిస్థితి. అక్కడ పేదల కోసమని లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. రెండు విడతల్లో 141 ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. 62 పట్టాలకు (మిగతా 6వ పేజీలో..)

రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు

- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుండడంతో రానున్న నాలుగు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ నెల 26 నాటికి అల్పపీడనం వాయుగుండంగా బలపడి, అదే రోజు దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరం దాటుతుందని వాతావరణశాఖ అంచనా వేస్తుందన్నారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదన్నారు. 'వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా (మిగతా 6వ పేజీలో..)

పిడుగుపాటుకు ఇద్దరి మహిళల మృతి



ఊర్వశి (ఫైల్)

కవిటి/పోలాకి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మహిళలు మృతి చెందారు. కంచిలి మండలం జాడుపూడి గ్రామానికి చెందిన రెయ్యి ఊర్వశి(39), పిలక హేమ, పిలక పుణ్యవతిలు కవిటి మండలం ఆర్.కరాపాడు వద్ద వరి చేలలో మంగళవారం మధ్యాహ్నం కలుపు తీస్తుండగా పిడుగు పడింది. దీంతో ఊర్వశి మృతి చెందగా, మిగిలిన ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరు సోంపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భర్తతో విభేదాల కారణంగా ఊర్వశి తన పుట్టినిల్లు జాడుపూడిలో ఉంటుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దుర్గారావు తెలిపారు. ● మంగళవారం సాయంత్రం పిడుగుపడి పోలాకి మండలం ఉరజాం గ్రామానికి చెందిన కణితి పద్మావతి(40) మృతి చెందింది. భర్త కృష్ణారావుతో కలిసి వరి పొలంలో కలుపు తీస్తుండగా పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేశారు.



భార్య పద్మావతి మృతదేహం వద్ద భర్త కృష్ణారావు

తీరం కోత..

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 193 కి.మీ తీరప్రాంతం ఉంది. 255 మత్స్యకార గ్రామాలు ఉండగా, చేపల వేటకు అనువైన ప్రదేశాలు 18 ఉన్నాయి. సముద్రానికి ఆనుకొని 39 గ్రామాలు ఉన్నా యి. అయితే, ప్రకృతి వైపరీత్యమో మానవ తప్పిదమో తెలియదుగాని జిల్లాలో పలుచోట్ల సముద్ర తీరాలు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే కళింగపట్నం బీచ్ కోతకు గురై కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. తాజాగా, అలల ఉధృతికి పెద్దగణగళ్లవానిపేట వద్ద సముద్ర తీరం భారీగా కోతకు గురవుతోంది. కెరటాల ధాటికి ఇసుకంతా కొట్టుకుపోవడంతో తీర ప్రాంతం దెబ్బతింది. ఈ తీరాన్ని ఇటీవల కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. తీరం సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

కోతకు గురైన పెద్దగణగళ్లవానిపేట తీరం





పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయం

ఇలాగైతే పాలన ఎలా?

- పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో కీలకమైన పోస్టులు ఖాళీ
- జూనియర్ అసిస్టెంట్లు, తాత్కాలిక సిబ్బందితోనే నెట్టుకొస్తున్న వైనం

పలాస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో పూర్తిస్థాయి సిబ్బంది లేరు. కేవలం జూనియర్ అసిస్టెంట్లు, తాత్కాలిక సిబ్బంది, సచివాలయ సిబ్బందితో పాలన నెట్టుకొస్తున్నారు. కొత్త నియామకాలు చేపట్టాల్సింది పోయి ఉన్న సిబ్బందిని డిప్యూటేషన్ పేరుతో పొరుగు మున్సిపాలిటీలకు పంపిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ కొత్తగా సిబ్బందిని నియమిస్తున్నా వివిధ కారణాలతో ఇక్కడకు వచ్చేందుకు వారు ఇష్టపడడం లేదు. గ్రేడ్-2 మున్సిపాలిటీగా జిల్లాలోనే పలాస-కాశీబుగ్గ అగ్రస్థానం పొందింది. సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న పురపాలకసంఘంలో పనిచేయడానికి తగినంతగా ఉద్యోగులు లేరు. మున్సిపాలిటీకి గుండెకాయలాంటి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ కార్యాలయాల్లో ప్రధాన అధికారులు లేరు. ఎంతో ముఖ్యమైన మేనేజర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఇద్దరు టౌన్‌ప్లానింగ్ అధికారులు, నలుగురు టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ అధికారులు ఉండాలి. కానీ, ఒక్కరు కూడా లేకపోవడంతో తాత్కాలిక సిబ్బంది, సచివాలయ టౌన్‌ప్లానర్లతో పాలన కొనసాగించాల్సి వస్తోంది. ఫలితంగా కొత్త భవనాలకు అనుమతులు తీసుకోవడానికి నిర్మాణదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రోజుల్లో కావాల్సిన పని 15 రోజులవుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. మేనేజర్, రెవెన్యూ అధికారి (మిగతా 6వ పేజీలో..)

రొయ్యల చెరువులతో రోగాలు

- తాగునీటి వనరులు కలుషితం
- వెంటనే వాటిని తొలగించండి
- పెద్దగణగళ్లవానిపేట వాసుల ఆందోళన

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళ్లేపల్లి పంచాయతీలోని రొయ్యల సాగు చెరువులతో తాము రోగాల బారిన పడుతున్నామని, వాటిని తక్షణమే తొలగించాలని పెద్దగణగళ్లవానిపేట గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఎంపీటీసీ చీకటి అమ్మోజీరావు, నాయకుడు బర్రి రామారావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళ్లేపల్లిలో కొందరు రొయ్యల చెరువులను సాగు చేస్తూ వ్యర్థాలను మాత్రం పెద్దగణగళ్లవానిపేట సమీపంలోని నాగావళి నదికి ఆనించి ఉన్న సాగునీటి కాలువలో విడిచిపెడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయన్నారు. ఆ నీటిని తాగేందుకు, స్నానాలకు వాడడంతో తామర, దురదలతో పాటు మలేరియా, వంటి విషజ్వరాల బారినపడుతున్నామని వాపోయారు. నదీ జలాలు కూడా కలుషితం కావడంతో చేపలు దొరక్క స్థానిక మత్స్యకారులు వలసలు పోతున్నారని అన్నారు. చెరువుల కోసం రోడ్డు మీద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లతో మనుషులు, పశువులు కరెంటు షాక్‌కు గురవుతున్నారన్నారు. రొయ్యల చెరువులు తొలగించాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినా జిల్లా అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుక్కల్ల కామయ్య, గ్రామస్థులు రామారావు, బర్రి కృష్ణ, పి.అప్పలస్వామి, అమ్మోజీ, అమ్మోరు, అప్పారావు, అశోక్, పాపారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పైడిమాంబకు ఘట నీరాజనం

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవ సంబరానికి ముందే విజయనగరంలో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం రాత్రి నగరంలోని పలు వీధుల నుంచి భక్తులు పైడిమాంబ ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయం వద్ద సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఘటాల ఊరేగింపులో సాముగారడీలు, పులివేషాలు, శక్తివేషాలు, ఖాళీమాత, దుర్గాదేవి వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు.



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గాయత్రీదేవిగా కోటదుర్గమ్మ



గాయత్రీదేవి అలంకరణలో..

పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు మంగళవారం పాలకొండ కోటదుర్గమ్మ గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీప్రసాదశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన ప్రజలు క్యూలైన్లలో బారులు దీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఎవరికీ ఎటువంటి కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. జిల్లా దేవదాయశాఖాధికారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూకు రేపటి నుంచి దసరా సెలవులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు గురువారం నుంచి అక్టోబరు 8 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 9వ తేదీన తిరిగి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు.

చైతన్య పథం.. సేవా మార్గం
● నేడు ఎన్‌ఎస్‌ఎస్ డే
6లో
వర్షం పడితే సాధన అంతే!
● క్రీడా మైదానాల్లో నిలుస్తున్న నీరు
పీజీ కోర్సుల్లో సీట్ల కేటాయింపు
7లో

చైతన్య పథం.. సేవా మార్గం

- నాయకత్వ లక్షణాలను పెంచే జాతీయ సేవా పథకం
- నేడు ఎన్ఎస్ఎస్ డే



బీఆర్ఏయూలో ప్రీ రిపబ్లిక్ సెలక్షన్స్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

ఎచ్చెర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

మానవ సేవే మాధవ సేవ అనేది ఆర్యోక్తి. సేవ చేసే భాగ్యం అందరికీ దక్కదు. విద్యార్థి దశలో సేవ చేసే అదృష్టం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా లభిస్తుంది. విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేది ఎన్ఎస్ఎస్. మెరుగైన సమాజ నిర్మాణంలో విద్యార్థి దశలో భాగస్వామ్యం కావడం ఎన్ఎస్ఎస్‌తోనే సాధ్యమవుతుంది. భారతదేశంలో జాతీయ సేవా పథకం 1969 సెప్టెంబరు 24న ప్రారంభమైంది. దేశం మొత్తమ్మీద 30 యూనివర్సిటీల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు ప్రారంభించారు. వీటిలో ఆంధ్రా యూనివర్సిటీ ఉండడం విశేషం.

బీఆర్ఏయూ ఆధ్వర్యంలో 110 యూనిట్లు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలో 110 యూనిట్ల ద్వారా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని నేతృత్వంలో, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్ల పర్యవేక్షణలో జిల్లాలోని జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంబేడ్కర్ వర్సిటీ పరిధిలో 11 వేల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పనిచేస్తున్నారు. ఇందులో దాదాపుగా 55 శాతం మంది బాలికలు, 45 శాతం మంది బాలురు ఉన్నారు. అంబేడ్కర్ వర్సిటీ తరఫున నలుగురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దేశ రాజధానిలో గణతంత్ర వేడుకల్లో జరిగిన పరేడ్‌లో పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు ఇలా..

ఎన్ఎస్ఎస్ ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించే వీలుంది. తన చుట్టూ ఉన్న సమాజాన్ని చక్కదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థి దశలో బాగా ఉపయోగపడుతుంది. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా శిబిరాలను నిర్వహిస్తున్నారు. మానవ హక్కులు, వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలు, చట్టంపై అవగాహన, వ్యక్తిగత పరిశుభ్రత, సమాజాభివృద్ధి, యోగా తదితర అంశాలపై వలంటీర్లకు తర్ఫీదునిస్తున్నారు.

రక్తదాన శిబిరాల నిర్వహణపై..

ఇప్పటికీ రక్తదానంపై అనేక మందికి సరైన అవగాహన లేదు. రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించి గ్రామ స్థాయిలో శిబిరాల నిర్వహణకు ఎన్ఎస్ఎస్ ద్వారా కృషి చేస్తున్నారు. గతంలో శ్రీకాకుళం కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తే... ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రోడ్లు శుభ్రం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.



సాహస యాత్రలో పాల్గొన్న వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న అధికారులు (ఫైల్)

గ్రామాల్లో శిబిరాలు..

కళాశాలల తరఫున ఎన్ఎస్ఎస్ యూనిట్లు రెగ్యులర్ శిబిరాలను, అలాగే ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తుంటాయి. వీటి నిర్వహణ కోసం కేంద్ర క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ నిధులను విడుదల చేస్తుంది. ఈ నిధులతో గ్రామాల్లో లేదా పట్టణాల్లో మురికివాడలను దత్తత తీసుకొని శిబిరాలను నిర్వహిస్తారు. ప్రత్యేక శిబిరాల్లో శ్రమదాన కార్యక్రమాలతో పాటు వైద్య, దంత శిబిరాలను నిర్వహించి ప్రజలకు సేవలందేలా చూస్తున్నారు.

రెండేళ్లలో 240 గంటలు సేవలందిస్తే..

విద్యార్థి దశలో రెండేళ్లలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 240 గంటలు సేవలందించాలి. ఇందులో ఏడాదిలో వ్యక్తిత్వ వికాసానికి 30 గంటలు, సమాజ సేవకు 90 గంటలు కేటాయించాలి. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా మాదిరిగానే ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయి. విద్యా అవకాశాలకు సంబంధించి ప్రతి సెక్షన్‌లో ఒక సీటు కేటాయిస్తారు. ప్రత్యేక శిబిరాల్లో పాల్గొన్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో అదనపు మార్కులు కేటాయిస్తారు.

ప్రజల్లో చైతన్యం..



ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా సేవలందించడమంటే అదృష్టంగా భావించాలి. సమాజ సేవలో భాగస్వామ్యమయ్యేందుకు విద్యార్థులు ముందుకు రావడం శుభపరిణామం. సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు ఈ శిబిరాల ద్వారా కృషి చేస్తున్నాం.

-డాక్టర్ డి.వనజ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ



హెలికాప్టర్ విహారాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న

కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో హెలికాప్టర్ విహారం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ విహారాన్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. భక్తులకు ఇది ఎంతో ఆకట్టుకుంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. హెలికాప్టర్‌లో ఆకాశంలో విహరించటంతో సంతోషంగా ఉందని స్థానికులు తెలిపారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను, కొత్తపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కోటబొమ్మాళి ఐకాన్‌ను మంత్రులు ప్రారంభించారు. అనంతరం వివిధ ఆలయాలను దర్శించుకున్నారు.

సంప్రదాయాలను గుర్తుచేసేలా..

- విద్యార్థుల దసరా ఉత్సవాలు

హరిపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గతంలో గ్రామాల్లో దసరా సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహించేవారు. రానురానూ ఆ సందడి తగ్గింది. అయితే, ఆనాటి సంప్రదాయాలను గుర్తుచేసేలా మందస మండలం బిడిమి పాఠశాల విద్యార్థులు మంగళవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు సార భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు రంగుల విల్లు, బాణాలు, తంగేడు పూలతో దసరా పాటలు పాడుతూ గ్రామంలో ఇంటింటా తిరిగి సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దసరా సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు



సహపంక్తి భోజనాలు చేస్తున్న చిన్నారులు

పట్టాలు సరే... స్థలాలేవీ?

(ఐదో పేజీ తరువాయి)

సంబంధించి ఇళ్ల స్థలాలు కోర్టు కేసుల్లో ఉన్నాయని చెప్పి పెండింగ్‌లో పెట్టారు.

ఆందోళనలో బాధితులు..

పట్టాలతో పాటు ఇళ్ల సైతం పొందారని 196 మంది పేర్లు ప్రభుత్వ రికార్డులోకి ఎక్కాయి. కానీ, వాస్తవానికి మాత్రం వారికి ఎటువంటి లబ్ధి చేకూరలేదు. రణస్థలం మండలంలోని జగనన్న లేఅవుట్లకు సంబంధించి పెద్ద గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు వివాదాస్పద భూములను జగనన్న కాలనీ లేఅవుట్ల కోసం కేటాయించినట్లు తెలుస్తోంది. అధిక ధరకు వాటిని కొనుగోలు చేసి ప్రభుత్వ ఖజానాకు సైతం చిల్లు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో వారే కోర్టులో కేసులు వేయించి లబ్ధిదారులకు స్థలాలు దక్కకుండా మోసం చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారిపోవడంతో ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి పెట్టింది..

రణస్థలం, జేఆర్‌పురంలోని జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇవి కోర్టు పరిధిలో ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారిచ్చే సూచనల మేరకు నడుచుకుంటాం. ఇప్పటికే ఇళ్ల పట్టాల అక్రమాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది.

-సనపల కిరణ్‌కుమార్, తహసీల్దార్, రణస్థలం

కొత్తమ్మ జంగిడికి ప్రత్యేక పూజలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం గుడిలో ఉన్న అమ్మవారి జంగిడికి ప్రత్యేక పూజలు చేశారు. అసాదీల కుటుంబీకుల పెద్ద తలపై పెట్టుకొని అమ్మతల్లి నిలయమైన రెడ్డికి వీధికి చెందిన కమ్మకట్టు చిన్న అప్పలనాయుడు ఇంటి వరకు ఊరేగింపుగా జంగిడిని తీసుకెళ్లారు. జంగిడి వెనుక పెద్ద ఎత్తున పేరంటాళ్లు (మహిళలు) వెళ్లారు. గ్రామపెద్ద కల్లి విశ్వనాథరెడ్డి, సర్పంచ్ కాళ్ల సంజీవరావు తదితర పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ జంగిడిని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రెడ్డిక వీధి నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి... కొత్తమ్మతల్లి ఆలయంలో ఉంచి పూజలు చేస్తారు.



అమ్మవారి జంగిడిని తీసుకువెళుతున్న భక్తులు

ఇలాగైతే పాలన ఎలా?

(ఐదో పేజీ తరువాయి)

శానటరీ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఇంజనీర్లు, ఇద్దరు అకౌంటెంట్లు, జూనియర్ అకౌంట్ అధికారి మొత్తం కలిపి 15 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్లనే డిప్యుటేషన్‌పై నియమించి పనులు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పారిశుధ్య సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. వందమందికి పైగా సిబ్బంది ఉండాల్సిన స్థానంలో కేవలం 67 మందితో పని చేయిస్తున్నారు. కొత్తగా నియమకాలు చేపట్టాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

భర్తీ ఎప్పుడో?

గత వైసీపీ ప్రభుత్వంలో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఎలాంటి కొత్త నియామకాలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతైనా పరిస్థితి మారుతుందని అంతా భావించారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. పైగా ప్రధాన శాఖల్లోని పలువురి సిబ్బంది వివిధ కారణాలతో బయటకు వెళ్లిపోతున్నారు. మరోపక్క మునిసిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులపై స్థానికులు ఫిర్యాదులు చేయడం సర్వసాధారణం అయిపోయింది. ఇక్కడ అభివృద్ధిపై పొరుగు రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కూడా ఫిర్యాదు చేస్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఫలితంగా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోగా, కొత్తగా విధుల్లో చేరడానికి సిబ్బంది సైతం ముఖం చాటేస్తున్నారు. ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితిపై ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల ఉన్నతాధికారులను కలిసి మాట్లాడారు. ఫిర్యాదులు పక్కన ఉంచి కొత్త నియామకాలు, పనులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా మునిసిపాలిటీని గాడిన పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రతీ మండలంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. కలెక్టరేట్‌లో 08942-240557 నెంబర్ అందుబాటులో ఉంటుంది. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. రోడ్లకు నష్టం జరిగితే వెంటనే మరమ్మతులు చేపట్టాలి. మట్టి గోడల ఇళ్లల్లో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. విద్యుత్తుకు అంతరాయం లేకుండా చూడాలి. వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల పని తీరు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై వచ్చిన ప్రజాభిప్రాయ సర్వే నివేదికలపై కూడా సమీక్షించారు. పీజీఆర్ఎస్ పెండింగ్ ఫిర్యాదులు, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేలకొరిగిన కటౌట్లు



కోటబొమ్మాళి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి ఉత్సవాలకు విద్యుత్ అలంకరణతో ఏర్పాటు చేసిన కటౌట్లు మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నేలకొరిగాయి. పెద్ద చెరువు దగ్గర పెట్టిన శ్రీకృష్ణుడి కటౌట్ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేంకటేశ్వస్వామి భారీ కటౌట్ కూడా పడిపోయింది. దీంతో సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పెద్ద చెరువు వద్ద నేలకొరిగిన కటౌట్

అసెంబ్లీలో మన వాణి

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ స్థానికంగా అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో నియోజకవర్గంలోని ప్రజలు అత్యవసర సమయాల్లో సమీపంలోని ఒడిశాలో గల అగ్నిమాపక కేంద్రాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. పాతపట్నంలో ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని అన్నారు. అలాగే ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ పోలీసు స్టేషన్ లేకపోవడంతో ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి స్టేషన్ సేవలను వినియోగించుకోవాల్సి వస్తోందని తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయండి

- ఎమ్మెల్యే గొండు శంకర్



గార రూరల్/ అరసవల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో వెనుకబడిన తరగతులకు చెందిన కొన్ని జాతులకు కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. గార మండలంలోని సతివాడ, కొమరవానిపేట, బోరవానిపేట, తంగుళ్లవానిపేట తదితర గ్రామాల్లో నివసిస్తున్న ఎర్రగొల్లలు, పాముల పట్టినవారు పిల్లల చదువుల నిమిత్తం కుల ధ్రువీకరణ పత్రాలును మండల రెవెన్యూ అధికారులు జారీ చేయడం లేదని వివరించారు. ఆర్డీవో సమక్షంలో త్రిసభ్య కమిటీ మంజూరు చేసిన ధ్రువపత్రం ఆధారంగా మంజూరు చేస్తున్నారని వివరించారు. దీని వల్ల కాలయాపన జరుగుతోందని తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయం ద్వారా వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

వర్షం పడితే సాధన అంతే!

- క్రీడా మైదానాల్లో నిలుస్తున్న నీరు
- క్రీడాకారులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు

అరసవల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలు క్రీడా సాధకులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. త్వరలో వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు జరుగనున్నాయి. దీంతో ఔత్సాహికులు నగరంలోని వివిధ మైదానాల్లో సాధన చేస్తున్నారు. అలాగే పోలీసు, మిలటరీ వంటి ఉద్యోగాలకు జరిగే పరుగు పందెం వంటి పోటీలకు మరికొందరు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలు వీరికి ఇబ్బందిగా మారాయి. వర్షానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడా మైదానం నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. 400 మీటర్ల ట్రాక్, బాస్కెట్‌బాల్ కోర్టు, వాలీబాల్ కోర్టు, క్రికెట్ మైదానం పూర్తిగా వర్షపు నీటిలో మునిగిపోయాయి. దీంతో క్రీడాకారుల సాధనకు ఆటంకం ఏర్పడింది. కొంతమంది క్రీడాకారులు మైదానం చుట్టూ ఉన్న రోడ్డుపైనే సాధన చేయాల్సి వస్తోంది. మరికొంతమంది క్రీడాకారులు ఏం చేయాలో తోచక.. సాధనకు అవకాశం లేకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. మైదానాన్ని ఆనుకొని ఉన్న కాలువల్లో పూడిక తీయకపోవడంతో... ఏమాత్రం వర్షం కురిసినా మైదానంలోనే నీరు నిలిచిపోతోంది. ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్యకు ఎవరూ పరిష్కారం చూపకపోవడంతో క్రీడాకారులు సాధన చేసేందుకు అవకాశం లేక ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకుని పురుషుల డిగ్రీ కళాశాల మైదానాన్ని సాధనకు అనువుగా తీర్చిదిద్దాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.



క్రికెట్ గ్రౌండ్ వద్ద ఇలా...



చెరువును తలపిస్తున్న పురుషుల డిగ్రీ కళాశాల మైదానం



వర్షపు నీటిలో మునిగిన బాస్కెట్‌బాల్ కోర్టు

నత్తనడకన 'స్వామిత్వ' సర్వే

- సచివాలయ సిబ్బందితో నామమాత్ర నిర్వహణ
- తప్పులతడకగా నివేదికలు?
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

గార రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఇళ్లు, స్థలాలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి యజమానులకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం స్వామిత్వ సర్వేని చేపట్టింది. ఈ సర్వేని పకడ్బందీగా నిర్వహించి భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో మండలంలో చేపట్టిన స్వామిత్వ సర్వే నత్తనడకన సాగుతోంది. ఈ ప్రక్రియ ప్రారంభించి నెలరోజులైనా ఇప్పటి వరకు ఆరు పంచాయతీల్లో సర్వే చేపడుతున్నారు. అయితే కేవలం సచివాలయ సిబ్బంది సర్వే చేపడుతుండడంతో పూర్తి స్థాయిలో లక్ష్యం నెరవే రడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా శ్రీకూర్మం, అంపోలు మేజర్ పంచాయతీ లతో పాటు మరో 23 పంచాయతీలున్నాయి. 26 సచివాలయాల పరిధిలో సుమారు 21 వేల ఇళ్లు, 82 వేల జనాభా ఉంది. సర్వే చేపట్టి నెలరోజులైనా ఇప్పటి వరకు నాలుగో వంతు కూడా పూర్తికాలేదు. దీంతో సర్వే ఎప్పటికి పూర్తయి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారో అధికారులకే ఎరుక. క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు..

ఇళ్లు, స్థలాలకు సంబంధించి అత్యాధునిక సాంకేతిక పరికరాల సాయంతో సర్వే చేసి ప్రజల ఆస్తులకు సంబం ధించి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంది. స్వామిత్వ సర్వేలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ సహాయకుడు బృందంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలి. అలాగే రోవర్, లేదా టేపు సాయంతో ఇల్లు లేదా స్థలం కొలతలు పక్కాగా నిర్ధారించాలి. సర్వే పూర్తయిన అనంతరం సంబంధించిన హక్కుదారులకు మ్యాప్‌తో కొలతల వివరాలు రాసి ఇవ్వాలి. ఆ తరువాత ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ ప్రక్రియ మండలంలో ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించారు. నెలరోజులు దాటినా ఇంకా 6 పంచాయతీల్లో మినహా మిగిలిన గ్రామాల్లో సర్వే చేపడుతున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో సర్వేకి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్లు హాజరుకావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు అధికారులు లేకుండా స్వామిత్వ సర్వే చేయించిన లోపభూయిష్టంగా ఉంటుందన్న విమర్శలూ లేకపోలేదు. కొలతలు, వివరాలు సక్రమంగా నమోదు కాకుంటే భవిష్యత్‌లో గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే మాదిరి కష్టాలు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వే లక్ష్యాలను పూర్తిస్థాయిలో నెరవేర్చేలా, హక్కుదారులకు ధ్రువీకరణ పత్రాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రామచంద్రాపురంలో సర్వేని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ (ఫైల్)

వేగంగానే సర్వే



సర్వే వేగంగానే జరుగుతోంది. కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు వల్ల కొంత ఆలస్యం అయినప్పటికీ ప్రస్తుతం 6 పంచాయతీల్లో సర్వే చేపడుతున్నారు. ఎటువంటి పొరపాట్లు జరగ కుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొలతలు, రికార్డులు పక్కాగా పరిశీలించిన తరువాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

-ఎ.రఘు, ఎంపీడీవో, గార

న్యూస్ బాక్స్

శరన్నవరాత్రులకు ఆహ్వానం

ఆమదాలవలస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వ హిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఆలయ సిబ్బంది ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని ఆయన స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రిక, ప్రసాదం అందించారు. రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో కొన్నేళ్లుగా ఎన్‌ఎంఆర్‌లుగా పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేలా సహకరించాలని సిబ్బంది ఆయనను కోరారు.

సౌత్‌జోన్ పోటీలకు కబడ్డీ జట్ల ఎంపిక నేడు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బెల్గావి, కర్ణాటకలో వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్న సౌత్‌జోన్ కబడ్డీ పురుషుల టోర్నమెంట్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున పాల్గొనే జట్ల ఎంపిక బుధవారం వర్సిటీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వర్సిటీ, అనుబంధ కళాశాలల క్రీడాకారులు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలన్నారు.

గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు



కొండములగాం కొండను పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండములగాం కొండ నుంచి గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శనపల కిరణ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కంకర దోపిడీ' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం ఆయన ఆదేశాలతో అధికారులు సదరు కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఇప్పటికే నిఘా ఉంచామన్నారు. సెలవు దినాల్లో ప్రత్యేక నిఘా పెడతామన్నారు. మరోవైపు అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఇంటిలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంధురాలికి అండగా ఉండాలి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశం

పొందూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణం వాండ్రంగి వీధిలో నివసిస్తున్న అంధురాలు కుమరాపు తవిటమ్మకు అండగా నిలిచి సమస్యను పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వ రరెడ్డి ఆదేశించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అంధురాలిపై కనికరం లేదా' శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. సదరు వృద్ధురాలి ఇబ్బందులపై ఆరా తీశారు. ఎస్‌బీ సిబ్బంది ద్వారా వివరాలను సేకరించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలు తెలుసుకుని వృద్ధురాలికి అండగా ఉండాలని పొందూరు పోలీసులను ఆదేశించినట్లు సమాచారం.

ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలతో వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరుద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి అందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, రామోజీ, కిషోర్, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

బీలను చిత్తడి నేలలుగా గుర్తించాలి

సోంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోంపేట సమీపంలో ఉన్న బీలను చిత్తడి నేలలుగా గుర్తించేలా కృషి చేయాలని పీపీ ఎస్ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. జీవో నెంబర్ 329 ను రద్దు చేయాలని, థర్మల్ ఉద్యమ కారులపై పెటిన కేసులను ఎత్తివేయాలని, ఎన్‌సీసీ వారికి కేటాయించిన భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు ఉన్నారు.



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు వినతి పత్రం ఇస్తున్న కృష్ణమూర్తి

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

ఎచ్చెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనకు వీలుగా నిక్షయమిత్రగా వ్యవహరించాలని డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీబీ రోగులకు మానసిక, సామాజిక సహకారాన్ని అందించాలన్నారు. స్వచ్ఛంద సేవకులు ముందుకు వచ్చి టీబీ రోగులకు అండగా నిలవాలన్నారు. రాష్ట్ర టీబీ కన్సల్టెంట్ డాక్టర్ మనోహర్ రెడ్డి, జిల్లా టీబీ ప్రోగాం అధికారి శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తలు డి.వనజ, పి.ముకుందరావు, పీవో టి.భవాని, పలువురు ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో సీట్ల కేటాయింపు

- బీఆర్ఏయూలో 600 సీట్లకు 252 భర్తీ

ఎచ్చెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్-2025 సీట్ల కేటాయింపు వివరాలను సెట్ కన్వీనర్ ప్రకటించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలు, వాటి అనుబంధ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఈ ఏడాది జూన్ 9 నుంచి 12వ తేదీ వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈనెల 8 నుంచి 20వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ జరిగింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆయా వర్సిటీలు, కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎంప ఫిలాసఫీలో 20కి ఒకటి, జియో ఫిజిక్స్, జియాలజీలో చెరొక 15 సీట్లు, ఎంజేఎంసీలో 30 సీట్లు ఉండగా ఒక్కటి కూడా భర్తీ కాలేదు. సోషల్ వర్క్‌లో 40కి 4, ఎకనామిక్స్‌లో 40కి 8, ఎంఎల్ఐఎస్సీలో 40కి 8, గ్రామీణాభివృద్ధిలో 40కి 11 భర్తీ అయ్యాయి. ఎంకాంలో 40కి 27, ఇంగ్లీష్‌లో 40కి 24, తెలుగులో 40కి 16, ఎంఈడీలో 40కి 12, బయోటెక్నాలజీలో 30కి 29, మైక్రో బయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీలో చెరొక 30 సీట్లు శతశాతం భర్తీ అయ్యాయి. ఎనలెటికల్ కెమిస్ట్రీలో 20కి 20 సీట్లు కేటాయించారు. గణితంలో 40కి 14, అప్లైడ్ మేథమెటిక్స్‌లో 20కి 11, భౌతిక శాస్త్రంలో 40కి 15 సీట్లు కేటాయించారు. బీఆర్ఏయూలో 10 ఆర్ట్స్, 9 సైన్స్ కోర్సుల్లో 600 సీట్లు ఉండగా వీటిలో 252 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

అలరించిన నృత్యాభినయం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో స్థానిక వేంకటేశ్వర డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీ చిన్నారులు ప్రదర్శిం చిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణంలో 30 మంది కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, కథాకళి నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులతో పాటు నాట్యగురువులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి, శృతి పట్నాయక్‌లను నిర్వాహకులు సత్కరించారు.

ఆకట్టుకున్న అంధుని వేణుగానం

సోంపేట రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎర్రముక్కాంలో మంగళవారం రాత్రి అంధుడు కుద్దాన ఢిల్లీరావు వేణుగానం శ్రోతులను ఆకట్టుకుంది. ఫ్లూటు, హార్మోనియం, కీబోర్డులపై 1986 నుంచి ఇప్పటి వరకు సుమారు 200 ప్రదర్శన లిచ్చినట్లు ఢిల్లీరావు తెలిపారు. కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలివ్వాలి

కంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కంచిలి పంచాయతీ బలియాపుట్టుగ కాలనీలో సర్వే నెం.297/3 పట్టాను రద్దు చేసి ఇళ్లులేని నిరుపేదలకు కేటాయించాలని సీపీఐ సీనియర్ నాయకుడు చాపర సుందర లాల్ కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పట్టాల స్థలంలో మంగళవారం సీపీఐ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో బలియాపుట్టుగలో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పట్టాలపై గతంలో టెక్కలి ఆర్డీవో విచారణ చేసి భూమి కేటాయింపులు నిబంధనలకు విరుద్ధమని కలెక్టర్‌కు సిఫార్సు చేశారన్నారు. తక్షణం ఆ పట్టాలు రద్దు చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, పి.ఆరేలమ్మ, జన్ని సోమేష్, అయినింటి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సుకు దరఖాస్తులు

ఆమదాలవలస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త బి.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ ఏపీఈఏపీసెట్‌తో సంబంధం లేకుండా నేరుగా నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చన్నారు. బైపీసీ, ఎంపీసీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ డిప్లొమో పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు వసతి సదుపాయం ఉందన్నారు. డబ్లుడబ్ల్యుడబ్ల్యు.ఏఎన్‌జీఆర్ఏయు.ఏపీ.ఇన్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీరో అవర్లో వ్యక్తిగత వ్యవహారాల ప్రస్తావన విడ్డూరం

రణస్థలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్‌లో ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తన వ్యక్తిగత వ్యవహారాలు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒక ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ఎటువంటి గ్రావెల్ నడప లేదని, ఎవరినీ భయభ్రాంతులకు గురిచేయలేదని పేర్కొనడం దురదృష్టకరమన్నారు. గ్రావెల్ తవ్వకాలకు లైసెన్స్ ఉన్న కాంట్రాక్టర్లను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆయన ఇంటి పరిసర ప్రాంతాలలో గ్రావెల్ ఏ విధంగా వేసుకున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చెవిటిపోలమ్మ తిరువీధి



అమ్మవారి ఊరేగింపు

జి.సిగడాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో గ్రామదేవత అసిరితల్లి చెవిటి పోలమ్మ వారాల్లో భాగంగా మంగళవారం అమ్మ వారి ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. పూజారి మక్క విజయలక్ష్మి ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి పూజలు చేసి లింగాపురం, నాగులవలస, పాతపెంట గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ శివారులోని గ్రామదేవత అసిరితల్లి వనం వద్ద వేలాది మంది భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, ముర్రాటలతో మొక్కులు చెల్లించుకున్నారు. పెంట గ్రామంలో మంగళవారం అప్పమ్మ పేరంటాలు ఆలయ మూడవ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పురోహితుడు రంగబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి

కంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొల్లూరు, ఎంఎస్ పల్లి సచివాలయ ఉద్యోగులు మంగళవారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, డీఏ బకాయిలు, ఇతర అలవెన్సులు వెంటనే చెల్లించాలని నినదించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం కల్పించాలి

కంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీలో స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కంచిలి మండలానికి చెందిన సుధాం ప్రధాన్, నేతాజీ ప్రధాన్ తదితరులు ఒక ప్రకటనలో కోరారు. ఒడియా గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారని, అయితే ఈ పోస్టుకు మాకు అర్హతలున్నా, నిబంధనలకు విరుద్ధంగా ఒడిశాలో ప్రాథమిక, ఉన్నత విద్య పూర్తి చేసిన అభ్యర్థికి పోస్టు ఖరారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా వచ్చిన దరఖాస్తుల్లో పీహెచ్‌డీ చేసిన అభ్యర్థికి ఆర్జేడీ ఆదేశాల మేరకు పోస్టు ఖరారు చేసినట్లు తెలిపారు.

15 మంది విద్యార్థుల రక్తదానం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థినీ, విద్యార్థులు రక్తదానం చేశారు. రిమ్స్ ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సర్టిఫికెట్లను అందించి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ షామిలి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో సంతోష్‌కుమార్, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

కంచిలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం డాక్టర్ శీల ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రాగోలు, బైరి గ్రామాల్లో..

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాగోలు, బైరి గ్రామాల్లో మంగళవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాగోలులో నిర్వహించిన వైద్య శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు లిల్లీ నిమ్మకాయల, ఎస్‌కే చాందిని మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది, బీజేపీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ఆమదాలవలస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను పెంపొందించుకోవాలని సత్యసాయి సేవా సంస్థల విద్యాజ్యోతి రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ గురుప్రసాద్ అన్నారు. మంగళవారం ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సత్యసాయి యువవికాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎం.జనార్దనరావు, ప్రిన్సిపాల్ ఎస్‌ఎస్‌ఎస్ స్వామి, సత్యసాయి మహిళా కోఆర్డినేటర్ లలిత, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు శ్రీకాకుళం జిల్లా పరిధిలోని ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడుల్లో పాసైన వారు ఈనెల 25 నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు డబ్లుడబ్లుడబ్లు.అప్రెంటిషిప్ ఇండియా.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు అక్టోబరు 16న ఉదయం 10 గంటలకు ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, వీటీ అగ్రహారం, విజయనగరంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరవ్వాలన్నారు. ఇదివరకే అప్రెంటిషిప్ పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేయవద్దన్నారు. మరిన్ని వివరాలకు 08922-294906 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రీడా పోటీల్లో వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున వివిధ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జాతీయ స్థాయిలో వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో మంగళవారం స్పోర్ట్స్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని వారికి అవసరమైన తర్ఫీదు ఇవ్వాలన్నారు. వర్సిటీ తరఫున 32 క్రీడా విభాగాల్లో పోటీలకు విద్యార్థులు పాల్గొనేలా తీర్మానించారు. సమావేశంలో వర్సిటీ స్పోర్ట్స్ బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయమోహన్, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, పీడీలు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





9.8 కిలోల గంజాయితో మహిళ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా మర్లభ గ్రామానికి చెందిన కిరణ్ ఆనంద అనే మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి 9.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పలాస రైల్వే స్టేషన్‌లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా కిరణ్‌ఆనంద అనే మహిళ గంజాయి బ్యాగ్‌ను పట్టుకొని రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. ఆమె గజపతి జిల్లా బద్యానాయక్ నుంచి గంజాయి కొనుగోలు చేసుకొని తమిళనాడులో ఉంటున్న బాలాజీ అనే బ్రోకర్‌కు గంజాయి ఇచ్చేందుకు వెళ్తుండగా.. పోలీసులకు పట్టుబడినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో భవన కార్మికుడి మృతి



చంద్రశేఖర్(ఫైల్)

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ రోడ్డులో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు మద్దిల చంద్రశేఖర్(37) మంగళవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సూదికొండ కాలనీలో నివాసం ఉం టున్న ఈయన భవన నిర్మాణం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లను తాకడంతో ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే అతడిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఈయనకు భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

గుండెపోటుతో న్యాయవాది..

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస, సోంపేట కోర్టులో న్యాయవాదిగా వ్యవహరిస్తున్న దానేటి నందగోపాల్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఈయన స్వగ్రామం పలాస మండలం గోపాలపురం. జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అధ్యక్షతన న్యాయవాదులు మౌనం పాటించి ఆయనకు నివాళులర్పించారు. నందగోపాల్ మృతిపై ఆమె విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయ్యాజ్ అహ్మద్, కార్యదర్శి బెండి కాళిదాస్, కోశాధికారి బి.రవి, న్యాయవాదులు సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్..



తవిటయ్య(ఫైల్)

జలుమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగిరికటకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కురమాన తవిటయ్య (50) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. తవిటయ్య కొన్నాళ్లుగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దహన సంస్కరణల కోసం రూ.15 వేలు ఉపాధి హామీ అధికారులు అతడి భార్య రమాదేవికి అందించారు. ఇతడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు దుంగ రాంబాబు, కొర్ను రామారావు, రమేష్, నేతింటి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కురిగాం గ్రామానికి చెందిన పడ్డాల బాలకృష్ణ(40) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు హెచ్‌సీ కోటేశ్వరావు తెలిపారు. తాపీమేస్త్రీగా పనిచేసుకుంటున్న బాలకృష్ణ మద్యానికి బానిసై నిత్యమూ భార్యతో తగాదా పడుతుండేవాడు. దీంతో అతడి భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో ఉన్న గడ్డిమందును తాగి అపస్మారకస్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే కొత్తూరు ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యంకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస మండలం గరుడఖండికి చెందిన సాయికుమార్ మంగళవారం నవభారత్ జంక్షన్ మీదుగా కారుతో నగరంలోకి ప్రవేశించారు. లక్ష్మీథియేటర్ జంక్షన్ వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎదురు రోడ్డులోకి ప్రవేశించి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అయితే కారులో ప్రయా ణిస్తున్న వారికి ఎటువంటి గాయాలవలేదు. విద్యుత్ స్తంభం నేలపై పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. ఈ ఘటనను చూసిన స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు సమాచారం మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి కారును పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కలమట, మరో 18 మందికి కోర్టులో ఊరట



కొత్తూరు కోర్టుకు హాజరైన కలమట, టీడీపీ నాయకులు

కొత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తనతో పాటు మరో 18 మందికి కోర్టులో ఊరట లభించినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి తెలిపారు. 2019లో నమోదైన కేసులో ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కొత్తూరు కోర్టు కొట్టివేసిందని చెప్పారు. 2019 నవంబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల పక్షాన నిలబడి నిరసన తెలిపితే.. ముఖ్యమంత్రిపై నినాదాలు చేశామంటూ కక్షసాధింపుగా వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమకేసు.. నేడు న్యాయం, ధర్మం ముందు ఓడిపోయిందని తెలిపారు. ఈ తీర్పు వైసీపీ కుటిల బద్ధికి తగిన గుణపాఠంగా ఆయన అన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ట్రక్కర్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు ఎయిడ్స్ నివారణ చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు కొండల మధుబాబు, తమ్మినాన పాపారావు పాల్గొన్నారు.



విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి సైకిల్‌పై బయలుదేరిన భక్తులు

సైకిల్‌పై విజయవాడకు..

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ కనక దుర్గమ్మ మొక్కులు చెల్లించుకోవాలని పలాస, సోంపేట ప్రాంతానికి చెందిన పొందర రవికుమార్, మద్దు శంకరరావు, బతకల దీర్ఘారావు మంగళవారం సైకిల్‌పై బయలుదేరారు. ఈ మేరకు స్థానిక రైల్వేస్టేషన్‌లో సీతారామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సైకిల్ యాత్ర ప్రారంభించారు. సుమారు 700 కిలోమీటర్లు తాము సైకిల్‌పై వెళ్లి దుర్గమ్మను దర్శించుకుంటామన్నారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ.. పదేళ్ల కిందట మొక్కుకున్నామని.. ఇప్పుడు చెల్లించుకుంటున్నామని తెలిపారు.



స్ఫటిక లింగానికి ..

టెక్కలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపం వద్ద స్ఫటిక లింగానికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, పూలతో అలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో భవానీ భక్తులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ

శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రీదేవి రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి బృందం



జలుమూరు: శ్రీముఖలింగంలోని వారాహి అమ్మవారి సన్నిధిలో..



పాతపట్నం: గాయత్రీదేవిగా నీలమణిదుర్గ అమ్మవారు



ఇచ్ఛాపురం: బ్రహ్మచారిణిగా స్వేచ్ఛావతి అమ్మవారు



నందిగాం: నీలమణిదుర్గ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు..



హిరమండలం: అమ్మవారి తొమ్మిది అవతారాల్లో చిన్నారుల ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్: కత్రావీధి దుర్గాదేవి ఆలయంలో గాయత్రీదేవి అవతారంలో..

దూడలకు బూస్టర్ డోస్ వేయించాలి

పాతపట్నం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలు నిండిన ప్రతీదూడలకు గాలి కుంటువ్యాధి సోకకుండా బూస్టర్ డోసులు వేయాలని పశుసంవర్థకశాఖ టెక్కలి డివిజనల్ ఏడీ డాక్టర్ సీహెచ్ నరసింహులు తెలిపారు. పాతపట్నంలో గాలికుంటువ్యాధి నియంత్రణ టీకాలేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్కలి డివిజన్‌లోని 16 మండలాల్లో 1.37లక్షల టీకాలు పెద్దపశువులకు 17,125 టీకాలను దూడలకు వేస్తూ అదేదూడలకు ఒకనెల తరువాత బూస్టర్ డోస్ కూడా వేయనున్నట్టు తెలిపారు. డివిజన్ పరిధిలో 65 బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని నిర్దేశిత సమయంలో లక్ష్యసాధన పూర్తి చేస్తామని తెలిపారు. పాతపట్నం ఏడీ ఎం.కరుణాకరరావు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల పనిగంటలు పెంచడం సరికాదు

మందస/హరిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల పనిగంటలు పెంచుతూ శాసనసభలో తీర్మానం చేయడం సరికాదని సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు అన్నారు. మందసలో మంగళవారం మిల్లు కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్ట మాట్లాడారు. పోరాటాలు చేసి 8గంటల పని గంటలు సాధించుకుంటే కార్పొరేట్ల కోసం చట్టాలను మార్చి కార్మికులను బానిసలుగా చేయడం ఎంతవరకు సబబన్నారు. మిల్లు కార్మికుల సంఘ నాయకులు బి.వెంకటేష్, లచ్చుమయ్య, ఎన్.లచ్చయ్య, మల్లేష్, హరి పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

కొత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వసప కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక ఇటీవల 10.5 క్వింటాలు బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుబడిన ఆమెపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మాతలలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల పిల్లల కడుపు మాడ్చి మిగిల్చిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు ప్రయత్నించడం క్షమించరాని విషయమన్నారు. అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫిర్యాదుదారులు నిరసన

కొత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-1(క్రిష్ణాపురం) నిర్వాసిత కాలనీలో స్థలాలు ఆక్రమణపై గ్రామానికి చెందిన కొంతమంది పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం దర్యాప్తునకు హాజరుకావాలని ఫిర్యాదుదారులకు నోటీసులిచ్చిన అధికారులే రాకపోవడంపై వారంతా నిరసన తెలిపారు. కాలనీలో ప్రభుత్వ స్థలంలో ఆలయ అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించిన స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవటలేదని వారంతా ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ బాలకృష్ణ మాట్లాడుతూ.. విచారణకు నోటీసులు ఇచ్చామని, కోటబొమ్మాళి అమ్మవారి పండగ డ్యూటీలో ఉండడం వల్ల హాజరు కాలేకపోయమాన్నరు. కోర్టు ఆదేశాల మేరకు పనులు నిలుపుదల చేయిస్తామన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

హిరమండలం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తంప గ్రామంలో సర్పంచ్ మామిడి గణపతి పంచాయతీకి ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భర్త సర్పంచ్‌గా, భార్య కార్యదర్శిగా పంచాయతీలో విధులు నిర్వహిస్తూ చేయని పనులకు పలు మార్లు నిధులు డ్రా చేసి దుర్వినియోగానికి పాలప్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే ఆరుసార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇటీవల పంచాయతీ నిధులు సుమారు రూ.2 లక్షలు డ్రా చేసి దుర్వినియోగం చేసినట్లు గ్రామానికి చెందిన బెజ్జిపల్లి శ్రీధర్ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు సర్పంచ్‌పై చర్యలు తీసుకోకపోతే ధర్నా చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

వ్యాధి నిర్ధారణతోనే చికిత్స సాధ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులను నివారించేందుకు వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకొంటే శారీర కంగా ఆరోగ్యం కలుగుతుందని తురకపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికా రులు పాపారావు, వసుధ తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల కార్యక్ర మంలో భాగంగా కరకవలస గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం తోపాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.యోగీశ్వరరావు, సిబ్బంది ఎస్.కిరణ్, ఈశ్వరమ్మ, ఆరుద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మికులంతా ఉద్యమించాలి

టెక్కలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పనికాలాన్ని పది గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు ఉద్యమించాలని, కార్మిక చట్ట సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు హెచ్.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా సీఐటీయూ 12వ మహాసభలు అక్టోబరు 4, 5 తేదీల్లో సోంపేటలో జరుగుతాయని, మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

పలాసరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస మండలంతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని జగన్నాథసాగర ఆయుకట్టు, ఉదయపురం, మొగిలిపాడు గ్రామాలకు చెందిన రైతులు పదిరోజుల కిందట కాశీబుగ్గ ఏవో కార్యాలయంలో ఎరువుల కోసం వారి పేర్లను నమోదు చేసుకున్నారు. అప్పటి నుంచి యూరియా దొరకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆయా గ్రామాల రైతులకు టోకెన్లు ఇచ్చి ఓ ప్రైవేటు డీలరు వద్దకు పంపించగా రైతులంతా ఒక్కసారిగా చేరడంతో గందరగోళం నెలకొంది. కొందరు రైతుల మొబైల్స్‌కు ఆధార్ కనెక్ట్ కాకపోవడం, ఓటీపీలను రైతులు సమయానికి తెలపకపోవడంతో వారంతా ఇబ్బందిపడ్డారు. ఇప్పటికైనా సరైన సమయంలో రైతులకు యూరియా అందించి ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు. కాగా యూరియా సరఫరా సమయంలో రెవెన్యూ, వ్యవసాయాధికారులు లేకపోవడంతో రైతులు ఇబ్బందిపడ్డారు.

నరసన్నపేటలో..



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

నరసన్నపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ తగినంత యూరియా అందుబాటులో ఉందని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సూర్యకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలో సుగుణ ట్రేడర్స్ వద్ద యూరియా పంపిణీ నిర్వహించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏడు గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేశామని, మరో రెండు రోజుల్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో అందిస్తామని స్పష్టం చేశారు.

సభను విజయవంతం చేయాలి

హరిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పైల చంద్రమ్మ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 25న నిర్వహించే ఈ కార్యక్రమంలో పేద, పీడిత వర్గాలు పాల్గొనాలన్నారు. మందస మండలం కొండలోగాం, కుసుమాల, బంసుగాం, కుడుమాసయి, బల్లేగాం తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. బర్లగోపి, రాపాక మాధవరావు, ధనుంజయ్, పుల్లయ్య, లక్ష్మి రామారావు పాల్గొన్నారు.

నందిగాంలో భారీ వర్షం



నందిగాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో మంగళవారం భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షం పంటలకు ఉపకరిస్తాయని రైతులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వర్షం కారణంగా జాతీయరహదారి అండర్ పాసేజ్ వాహనదారులతో నిండిపోయింది. విశ్రాంతి భవనాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఏపీటీపీసీ బోర్డు సమావేశం

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన మంగళవారం బోర్డు సమా వేశం రాజధాని అమరావతిలో నిర్వహించారు. సమావేశంలో 2021-22, 23 ఆర్థిక సంవత్సరాల ఖాతా పుస్తకాలు, కాగ్ ఆడిట్ రిపోర్టులను సమావేశం ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్, ఎండి శేఖర్‌బాబు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదినారాయణ, జేడీ దాసరి శ్రీధర్, జీఎం హనుమాన్‌నాయక్, కంపెనీ సెక్రటరీ కరుణాకర్, ఆడిట్ మేనేజర్ శ్రీరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాతపట్నం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలాంధ్ర రోడ్‌లోగల మోడల్ స్కూల్ ప్రాంగణంలో దివ్యాంగ విద్యార్థులకు సమగ్రశిక్షఅభియాన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను అందించేందుకు ఈ శిబిరం నిర్వహించినట్టు జిల్లా కోఆర్డినేటర్ బి.గోవిందరావు తెలిపారు. 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవోలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళ మృతి



పగడాలమ్మ మృతదేహం

పెందుర్తి (విశాఖపట్నం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామానికి బయలుదేరిన మహిళ గుండెపోటుతో ఆర్టీసీ బస్సులోనే కుప్పకూలిపోయింది. పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం తుహసింగి గ్రామానికి చెందిన ఇసై పగడాలమ్మ(53) ఇటీవల విశాఖనగరంలోని చినముషిడివాడలో ఉంటున్న కుమారుడు శ్రీనివాసరావు ఇంటికి వచ్చింది. తిరిగి స్వగ్రామం చేరేందుకు కోడలు స్వప్నతో కలిసి మంగళవారం చినముషిడివాడ బస్టాప్‌కు వచ్చింది. ఆమెను విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్లే బస్సును ఎక్కించిన కోడలు జాగ్రత్తలు చెప్పి పంపింది. అయితే బస్సు వేపగుంట జంక్షన్ వద్దకు చేరుకునే సరికి పగడాలమ్మ ఒక్కసారిగా కుప్పకూలి సీటులోంచి కింద పడిపోయింది. గమనించిన డ్రైవర్ బస్సును నిలిపివేసి, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. వారు సంఘటనాస్థలికి చేరుకుని పరీక్షించి, గుండెపోటుతో మృతి చెందినట్టు నిర్ధారించారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

సీమెన్ శిక్షణతో ఉపాధి



ఏపీఎన్ఆర్‌టీ చైర్మన్ మేమూరి రవికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష, వెంకన్నచౌదరి దంపతులు

పలాస, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీమెన్ శిక్షణ కేంద్రం, ఆర్మీ, ఇతర డిఫెన్స్‌కు ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదిరి కోరారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలో ఏపీఎన్ఆర్‌టీ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ) చైర్మన్ వేమూరి రవిని కలిసి వినతిపత్రం అందించారు. పలాసలో ఇటువంటి శిక్షణ ఇవ్వడం వల్ల యువతకు ఉపాధి పెరుగుతుందని, ఉద్దానం ప్రాంతంలో అనేక మంది యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడే శిక్షణ ఇస్తే వారికి అన్నీ విధాలా ఉపయోగంగా ఉంటుందని వివరించారు.

భవనం పూర్తి చేయించండి

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు మంగళవారం రాజధాని అమరావతిలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజను ఆమె కలిసి వినతి పత్రం అందజేశారు. 2014లో భవనం నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే గౌతు శివాజీ నిధులు మంజూరు చేయడంతో పాటు భూమిపూజ చేశారు. చాలా వరకు పనులు జరిగినా.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయయాన్నరు. ఇప్పుడైనా ఈ భవన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలాస నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఎన్ఆర్‌జీఎస్ నిధులు విడుదల చేయాలని కోరారు.

జీఎస్‌టీ విమోచనపై హర్షం

పలాసరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస ఎల్ఐసీ బ్రాంచ్ ఆవరణలో ఎల్ఐసీ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్‌టీ విమోచన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసీతో అనుబంధం ఉన్న సీనియర్ పాలసీ హోల్డర్స్‌ను, సీనియర్ ఏజెంట్లను సన్మానించారు. కేక్‌ను కట్ చేసి సందడి చేసుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు రాజేంద్రనాయుడు, బ్రాంచ్ సెక్రటరీ ఎస్.నాగేశ్వరరావు, ఏజెంట్లు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాడాడ కూడలి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం నగరంలోని సారంగవీధికి చెందిన రెడ్డి రాము తన స్నేహితుడితో కలిసి సోమవారం రాత్రి 7.30 సమయంలో వాడాడ నుంచి వస్తుండగా ఒప్పంగికి చెందిన కోటిపల్లి రాజకుమార్ ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొనడంతో రాము, రాజకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. రాము బైక్‌పై వచ్చిన స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రెడ్డి రాము మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.

పేదల గొంతుక ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషిచేస్తున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. మంగళవారం కాశీబుగ్గలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో జిల్లా వాణిని, పలాస నియోజకవర్గంతో పాటు ఉద్దానం ప్రాంత సమస్యలను ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీషకు కృతజ్ఞతలు తెలిపారు. వంశధార జలాలను ఇచ్ఛాపురం వరకూ తీసుకువెళ్లేందుకు ఎమ్మెల్యే శిరీష పోరాడుతున్నారన్నారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, లేబర్ యూనియన్ నాయకులు అంబటి కృష్ణమూర్తి, సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సవర రాంబాబు తదితరులు ఉన్నారు.